సాక్షి రాజన్న సిరిసిల్ల

శుక్రవారం | 25 | ఏప్రిల్ | 2025



న్యాయమూర్తులకు స్వాగతం

సిరిసిల్లటౌన్: జిల్లా జడ్జి నీరజ, పోక్సో కోర్టు జడ్జి పుష్పలతలను లోక్ అదాలత్ మెంబర్లు గురువారం కలిసి స్వాగతం పలికారు. చింతోజు భాస్కర్, అన్నల్‌దాస్ వేణు, అంజనేయులు ఉన్నారు.



ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

గంభీరావుపేట: కోళ్లమద్దిలో పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కొండూరు రవీందర్‌రావు, తోట ఆగయ్య, కొమిరిశెట్టి లక్ష్మణ్, దయార్‌రావు పూజలు చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.0/28.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. తీవ్ర ఎండగా ఉంటుంది. రోజంతా వడగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపటి నుంచి ఇంటర్ డిస్ట్రిక్ట్ వుషూ చాంపియన్‌షిప్

సిరిసిల్లటౌన్: అమేచ్యూర్ వుషూ అసోసియేషన్, జిల్లా ఆధ్వర్యంలో సిరిసిల్లలోని పద్మనాయక ఫంక్షన్‌హాల్ వద్ద ఈనెల 26, 27, 28 తేదీల్లో రాష్ట్ర స్థాయి వుషూ పోటీలు జరగనున్నాయి. 3వ ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్–జూనియర్–జూనియర్ వుషూ చాంపియన్‌షిప్, 2వ ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ వుషూ చాంపియన్‌షిప్ నిర్వహించనున్నట్లు వివరించారు. వివరాలకు 94940 73930లో సంప్రదించాలని కోరారు.

కులవృత్తులను కాపాడండి



ముస్తాబాద్(సిరిసిల్ల): కార్పొరేట్ నుంచి కులవృత్తులను రక్షించాలని కోరుతూ ముస్తాబాద్‌లో స్వర్ణకారులు గురువారం రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ముస్తాబాద్ గ్రామపంచాయతీ ఎదుట స్వర్ణకారుల సంఘం మండలాధ్యక్షుడు చింతోజు బాలయ్య గురువారం దీక్షలను ప్రారంభించారు. బాలయ్య మాట్లాడుతూ ముస్తాబాద్‌లో రాజస్థాన్ జ్యువెలరీ దుకాణాలకు అనుమతులు ఇవ్వవద్దని కోరారు. జ్యువెల్లరీ దుకాణ యజమానులు ఇప్పటికే పలు పట్టణాల్లో మోసాలకు పాల్పడ్డారన్నారు. అంతేకాకుండా స్థానికంగా ఉన్న స్వర్ణకారుల ఉపాధిని దెబ్బతీసేలా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో ప్రారంభించే జ్యువెల్లరీ దుకాణాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు, బీజేపీ మండల అధ్యక్షుడు మెరుగు అంజాగౌడ్ వీరి దీక్షలకు సంఘీభావం తెలిపారు. స్వర్ణకారుల సంఘం నాయకులు నారోజు రాజు, శ్రీనివాస్, వెగ్గలం శ్రీను, రాజు, చేపూరి బ్రహ్మం, నాగరాజు, సతీశ్, శంకర్, రఘు, అనిల్, ఈశ్వరయ్య, వెంకటేశం, రవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరి జగన్మోహన్‌రెడ్డి కోరారు. మండలంలోని దుమాల, అక్కపల్లి, బుగ్గరాజేశ్వరతండాల్లో గురువారం నిర్వహించిన జై భీమ్.. జై బాపు, జై సంవిధాన్ పాదయాత్రకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజీవ్ యువశక్తి పథకాన్ని యువకులు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సన్నబియ్యం పథకంపై గ్రామాల్లో అందరికీ పూర్తిస్థాయిలో అవగాహన లేదని, దీనిపై ప్రచారం చేయాలన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, ఎస్‌కే గౌస్, శ్రీనివాస్, బాలయ్య, గణపతి, బుచ్చాగౌడ్, బండారి బాల్‌రెడ్డి, కదిరే శ్రీనివాస్, రవి, మధు, కిషన్, బాలాగౌడ్ పాల్గొన్నారు.

29న సదరం శిబిరం

సిరిసిల్లకల్చరల్: దివ్యాంగుల వైకల్య నిర్ధారణ కోసం ఈనెల 29న సదరం శిబిరం నిర్వహించనున్నట్లు ప్రభుత్వాస్పత్రి పర్యవేక్షకుడు డాక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. అవసరం ఉన్నవారు తమ వివరాలను తప్పుల్లేకుండా పొందుపరిచి మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. కంటిచూపు, మానసిక వైకల్యం గల వారు సంబంధిత మెడికల్ డాక్యుమెంట్లు, ఎక్స్‌రే తదితర సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

చిన్నారులకు టీకాలు వేయించాలి

- డీఎంహెచ్‌వో రజిత



కోనరావుపేట(వేములవాడ): ఈనెల 21 నుంచి అమలు చేస్తున్న ప్రత్యేక వ్యాధి నిరోధక టీకా కార్యక్రమంలో చిన్నారులకు టీకాలు వేయించాలని జిల్లా వైద్యాధికారి రజిత సూచించారు. మండలంలోని పీహెచ్‌సీ పరిధిలోని నిజామాబాద్, ధర్మారం, కొండాపూర్(నిమ్మపల్లి) ఆరోగ్య ఉపకేంద్రాల్లో అమలు చేస్తున్న ప్రత్యేక వ్యాధి నిరోధక టీకాల శిబిరాలను గురువారం తనిఖీ చేశారు. కోనరావుపేట పీహెచ్‌సీలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సాధారణ ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగేలా చూడాలన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అంజలి, డీఐవో సంపత్‌కుమార్, ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి వేణుమాధవ్ పాల్గొన్నారు.

ఒకే ఇల్లు.. ఒకే వంట

బలం.. బలగం

- ఇంటి పెద్ద మాటకు కట్టుబడి
- బంధాలు, బంధుత్వాలకు విలువనిస్తూ
- ఆదర్శంగా నిలుస్తున్న కుటుంబాలు

సాక్షి స్పెషల్ స్టోరీ

ఉమ్మడి కుటుంబం.. జీవిత పాఠం.. అలాంటి కుటుంబాల్లో భావోద్వేగాలకు..ఆప్యాయతలకు చోటుంటుంది. ఏది మంచో.. ఏది చెడో బాల్యం నుంచే చిన్నారులకు చెప్పే వారుంటారు. నీతి కథలు.. పెద్దల అనుభవాలు జీవిత పాఠాలుగా ఉపయోగపడుతాయి. ఏ ఆపదొచ్చినా.. ఒకరికొకరు సాయం చేసుకుంటూ మేమున్నామనే భరోసా ఉంటుంది. ప్రస్తుత ఉరుకులు పరుగుల జీవితంలో బంధాలు, బంధుత్వాలు భారమవుతున్నాయి. పెళ్లయిన కొన్నాళ్లకే వేరు కాపురాల సంఖ్య పెరుగుతోంది. ఎప్పుడో ఓసారి కలిసినప్పుడు నామమాత్రపు పలకరింపులు.. తర్వాత ఎవరి దారి వారిదే.. ఇలాంటి రోజుల్లో కొన్ని కుటుంబాలు ఉమ్మడిగా ఉంటూ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారు. విభేదాలు లేకుండా కలిసిమెలిసి ఉంటున్నారు. అలాంటి వారిపై 'సాక్షి' స్పెషల్ స్టోరీ..

– కోరుట్ల/సారంగాపూర్/మైటింక్లయిన్‌కాలనీ వేములవాడ/ముత్తారం/మల్యాల



భీమనాతి కుటుంబ సభ్యులు

భీమనాతి బలగం

తరతరాలుగా ఒకే ఇంట్లో ఉమ్మడి కుటుంబంగా కాలం గడుపుతూ ఆదర్శంగా నిలుస్తుంది. ఈ కుటుంబం కోరుట్ల పట్టణంలోని గాంధీ రోడ్‌లో నివాసముంటోంది. కుటుంబ పెద్ద భీమనాతి కాంతయ్య–గంగుబాయి దంపతులకు ఒక కుమార్తె, ఆరుగురు కుమారులు. భీమనాతి శ్రీనివాస్, వేణుగోపాల్, జనార్దన్, శ్రీధర్, దామోదర్, సాయికృష్ణ. కాంతయ్య ఇటీవల మృతిచెందినా ఆయన కొడుకులు తల్లి గంగుబాయితో కలిసే ఉంటున్నారు. వారసత్వంగా వస్తున్న ఐరన్‌హార్డ్‌వేర్ వ్యాపారంలో వీరంతా స్థిరపడ్డారు. వీరందరికీ పెళ్లిళ్లు కావడంతో పాటు పిల్లలు ఉన్నారు. తల్లి గంగుబాయితో కలిసి కొడుకులు–కోడళ్లు, మనుమలు, మనమరాళ్లు అంతా 27 మంది ఉన్నారు. వీరంతా ఒకే ఇంట్లో ఉండటమే కాదు.. ఒకే వంట కావడం విశేషం. రోజూ చిన్నపాటి ఫంక్షన్ తీరుగా ఇల్లంతా పెద్దలతో పాటు పిల్లాపాపలతో కళకళలాడుతుంది. తరతరాలుగా ఈ కుటుంబం ఉమ్మడిగా కాలం గడపటం నిజంగా ఈ కాలంలో ఓ వింతగానే తోస్తోంది.

– వివరాలు 10లో▸

సాదాబైనామాలకు భూభారతితో పరిష్కారం

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



అపెరల్‌పార్క్‌లో గోదాములు పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల/గంభీరావుపేట(సిరిసిల్ల): పెండింగ్ సాదాబైనామా దరఖాస్తులకు నూతన ఆర్వోఆర్ చట్టం భూభారతితో పరిష్కారం లభించనుందని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. గంభీరావుపేటలోని రైతువేదికలో గురువారం నిర్వహించిన భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. పీవోటీ, ఎల్‌టీఆర్, సీలింగ్ చట్టాల ఉల్లంఘనలు లేని దరఖాస్తులను క్రమబద్ధీకరణ చేసే నాటి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, రూ.100 అపరాధ రుసుం వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారని వివరించారు. భూ సమస్యలపై అధికారులు అందించిన ఆర్డర్లపై అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని, తీర్పుపై సంతృప్తి చెందకపోతే సివిల్ కోర్టుకు వెళ్లవచ్చని స్పష్టం చేశారు. ఆర్డీవో రాధాభాయి, ఏఎంసీ చైర్‌పర్సన్ కొమిరిశెట్టి విజయ, తహసీల్దార్ మారుతిరెడ్డి, ఆర్‌ఐలు గోపి, సత్యనారాయణ, ఎంపీవో సలావొద్దీన్ పాల్గొన్నారు. అనంతరం ముస్తఫానగర్, దేశాయిపేట గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ధాన్యం తరలింపు నిమిత్తం రెండు వాహనాలను కేటాయించామని తెలిపారు.

రైతులు ఆందోళన చెందొద్దు

రైతులు ఆందోళన చెందొద్దని, పది రోజుల్లోపు వర్షాలు లేవని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 28వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. కేంద్రాలకు వచ్చే నాణ్యమైన ధాన్యాన్ని కొనాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే చెల్లింపులు పూర్తిచేయాలన్నారు. జిల్లాలో అపెరల్‌పార్క్‌తోపాటు అందుబాటులో ఉన్న గోదాములను గుర్తించి ధాన్యం నిల్వ చేయాలన్నారు. రైస్‌మిల్లుల సమస్య కారణంగా ఎక్కడా ధాన్యం కొనుగోళ్లు ఆలస్యం కావడానికి వీలు లేదన్నారు. జిల్లాలో 500 లారీలు అందుబాటులో ఉన్నాయని, ప్రతీ కొనుగోలు కేంద్రం వద్ద రెండు లారీలను పెట్టాలన్నారు. డీఆర్‌డీవో శేషాద్రి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ పి.రజిత, అదనపు డీఆర్‌డీవో గొట్టె శ్రీనివాస్, డీపీఎంలు పద్మయ్య, సుధారాణి, ఏపీఎంలు పాల్గొన్నారు.

అపెరల్ పార్క్ సందర్శించిన కలెక్టర్

అపెరల్ పార్క్‌ను కలెక్టర్ సందర్శించారు. అపెరల్ పార్క్‌లోని ఆరు షెడ్లు, 12 కంపార్టుమెంట్లను ధాన్యం నిల్వ చేసేందుకు సిద్ధం చేయాలని పౌరసరఫరాల డీఎం రజితను ఆదేశించారు. ధాన్యాన్ని ఎప్పటికప్పుడు అన్‌లోడింగ్ చేయాలని, హమాలీలకు తాగునీరు, ఇతర సదుపాయాలు కల్పించాలన్నారు.

జాతీయస్థాయిలో రాణించాలి



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆకాంక్షించారు. సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో గురువారం రాత్రి జిల్లా స్థాయి ఆహ్వానిత వాలీబాల్ పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. విజేతగా సిరిసిల్లకు చెందిన స్పాట్ టీమ్, ద్వితీయ స్థానంలో సిరిసిల్ల వీబీఏ టీమ్ నిలిచాయి. తృతీయ గంభీరావుపేట, నాలుగోస్థానంలో రుద్రంగి జట్లు నిలిచాయి. విజేతలకు నగదు పారితోషికంతోపాటు ట్రోఫీ అందించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీకుమార్, ప్రధాన కార్యదర్శి అజ్మీర రాందాస్, గుడ్ల రవి, కోడం శ్రీనివాస్, నారాయణ, గడ్డం నర్సయ్య, బొప్ప దేవయ్య, సంపత్, సురేష్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయండి

- సిరిసిల్ల, చందుర్తిలలో రోడ్డెక్కిన రైతులు



కలెక్టరేట్ ఎదుట రాస్తారోకో చేస్తున్న రైతులు

సిరిసిల్లటౌన్/చందుర్తి(వేములవాడ): ధాన్యం వర్షార్పణం కాకుండా ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని కోరుతూ రైతులు సిరిసిల్ల, చందుర్తిలలో గురువారం రోడ్డెక్కారు. కలెక్టరేట్ ఎదుట రాస్తారోకో చేపట్టి మాట్లాడారు. తాము పండించిన ధాన్యం ఇప్పటి వరకు కొనుగోలు చేయడానికి పూర్తి స్థాయి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. సమీప జిల్లా నిజామాబాద్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు కూడా ఇస్తున్నారని, మన జిల్లాలో పరిస్థితి భిన్నంగా ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి ఎదురుచూసుడే అవుతుందన్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి తదితరులు రైతులకు సంఘీభావం తెలిపారు.

చందుర్తిలో..

రైతులు ధాన్యం కొనాలని కోరుతూ చందుర్తి బస్టాండ్‌లో బైఠాయించారు. రెండు వైపులా వాహనాలు నిలిచిపోవడంతో ఎస్సై అంజయ్య తన సిబ్బందితో అక్కడికి చేరుకొని రైతులను అక్కడి నుంచి బలవంతంగా లాగేశారు. అనంతరం ధాన్యం కల్లాల ఏర్పాటుకు 176 సర్వే నంబర్‌లో స్థలాన్ని కేటాయించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. రైతులు సిరికొండ శ్రీనివాస్, సిర్రం తిరుపతి, మర్రి రాజు, మెంగని రవి, షిర్డి మల్లేశం, సిర్రం మల్లేశం, తిప్పని భూమేశ్, మర్రి మల్లేశం, మర్రి రమేశ్, మేడిశెట్టి శ్రీహరి, మర్రి లక్ష్మీరాజం, మర్రి రాములుతో పాటు 50మంది రైతులు పాల్గొన్నారు.



చందుర్తి: తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

'సెస్' ఆస్తులను రక్షించాలి

- స్టోర్స్‌కు స్థలం సాధించాలి
- అక్రమ విద్యుత్ కనెక్షన్లు నియంత్రించాలి
- విద్యుత్ బకాయిలు వసూలు చేయాలి
- అవినీతి రహితంగా సేవలందించాలి
- సిరిసిల్ల 'సెస్' మహాజన సభలో సభ్యులు
- మిడిల్ పోల్స్ వేసి సమస్యలు పరిష్కరిస్తాం
- సభలో 'సాక్షి' కథనాన్ని ప్రస్తావించిన చైర్మన్ చిక్కాల రామారావు



మాట్లాడుతున్న 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు, వేదికపై వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి

సిరిసిల్ల: సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) ఆస్తులను రక్షించాలని, అవినీతి రహితంగా సేవలందించాలని సంస్థ 51వ మహాజన సభలో సభ్యులు కోరారు. సిరిసిల్ల పద్మనాయక కల్యాణ మండపంలో చైర్మన్ చిక్కాల రామారావు అధ్యక్షతన గురువారం నిర్వహించిన మహాజన సభలో మాట్లాడారు. జిల్లాలో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు 76 ఉండగా.. కొత్తగా మరో 17 కొత్త సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయని, టెండర్ల దశలో ఉన్నాయన్నారు. అదనంగా మరో 10 సబ్‌స్టేషన్లకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో స్థలం కేటాయించాల్సి ఉందన్నారు. జిల్లాలో 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు ఆరు ఉండగా.. మరో రెండు నేరెళ్ల, బోయినపల్లిల్లో ఏర్పాటుకు ప్రతిపాదించినట్లు తెలిపారు. 'సెస్'ను ఎన్పీడీసీఎల్‌లో కలపాలని కొందరు అవగాహన లేక మాట్లాడుతున్నారని, సహకార రంగంలో దేశంలోనే అత్యుత్తమ సంస్థగా 'సెస్'కు పేరుందన్నారు. ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ కంటే మెరుగైన సేవలు అందిస్తున్నామని రామారావు వివరించారు. విద్యుత్ కనెక్షన్ల మేరకు సిబ్బంది లేకున్నా.. సమర్థంగా, పారదర్శకంగా సేవలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. వ్యవసాయానికి 5 హెచ్‌పీల వరకే ఉచిత కరెంట్‌ను ఇస్తున్నారని, కొందరు 7.5, 10, 15 హెచ్‌పీల మోటార్లను అక్రమంగా అమర్చి విద్యుత్‌ను వాడుకుంటున్నారని, అలాంటి వారు విద్యుత్ కనెక్షన్లను క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. ప్రభుత్వం నుంచి బకాయిలు వస్తే సంస్థ లాభాల్లోకి వస్తుందన్నారు. 'సెస్'లో అక్రమంగా నియామకమై ప్రమోషన్లు పొందిన వారిపై విచారణ కమిటీని వేసి, కమిటీ సిఫార్సుల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

సభలో 'సాక్షి' కథనం ప్రస్తావన

'సెస్' స్టోర్స్‌కు సిరిసిల్లలోని పాతస్థలాన్ని అప్పగించాలని, లేదా.. ఐదెకరాల స్థలంతోపాటు రూ.10 కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో ఉన్న 'సెస్' సేవాసదన్‌ను, 20 గుంటల స్థలాన్ని సంస్థకు స్వాధీనమయ్యేలా కృషి చేస్తామన్నారు. ఈ అంశంపై 'సాక్షి'లో వచ్చిన కథనాన్ని చైర్మన్ సభలో ప్రస్తావించారు. 'సెస్'లో కొత్త రిక్రూట్‌మెంట్లను ఎన్పీడీసీఎల్ ద్వారా పారదర్శకంగా నియమిస్తామని స్పష్టం చేశారు. 'సెస్' ఎండీ పి.విజయేందర్‌రెడ్డి సంస్థ వార్షిక నివేదికను వివరించారు. ఆదాయ, వ్యయాలు, అంచనా బడ్జెట్, ప్రతిపాదిత లక్ష్యాలను 'సెస్' అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 'సెస్' వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి, డైరెక్టర్లు దిడ్డి రమాదేవి, దార్నం లక్ష్మీనారాయణ, మల్లుగారి రవీందర్‌రెడ్డి, గౌరినేని నారాయణరావు, చందుపట్ల అంజిరెడ్డి, వరుస కృష్ణహరి, మాడుగుల మల్లేశం, పొన్నాల శ్రీనివాస్‌రావు, ఆకుల గంగారాం, నామాల ఉమ, రేగులపాటి హరిచరణ్‌రావు, ఆకుల దేవరాజం, కొట్టెపల్లి సుధాకర్, 'సెస్' అధికారులు, 'సెస్' విలేజీ ప్రాతినిధ్య సభ్యులు ఉన్నారు.

సభ్యుల వాగ్వాదం

మహాజనసభలో సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఒకే వ్యక్తి ఎజెండా అంశాలన్నీ ప్రస్తావించడాన్ని తప్పుపడుతూ అందరికీ అవకాశం ఇవ్వాలని సభ్యులు కోరారు. దీనిపై సభ్యుల మధ్య కొంతసేపు వాగ్వాదం జరిగింది. చప్పట్లు కొట్టండి అంటూ.. 'సెస్' చైర్మన్ రామారావు పదే పదే కోరడాన్ని సభ్యులు తప్పు పట్టారు. చప్పట్లు కొడితే.. అంశాన్ని ఆమోదించినట్లే కదా.. అంశాన్ని చర్చించిన తరువాతే చప్పట్లు కొడతామని సభ్యులు వివరించారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలి



మా మండలానికి మల్లన్నసాగర్ నీళ్లు వస్తున్నాయి. రైతులు కాల్వల్లో మోటార్లు పెట్టి పొలాలు పారించుకుంటున్నారు. ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లపై ఓవర్‌లోడ్ అవుతుంది. కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలి. అక్రమ కనెక్షన్లు తొలగించాలి. ఏఈఈలు, 'సెస్' సిబ్బంది బాగా పని చేస్తున్నారు. విద్యుత్ బకాయిల వసూళ్లకు సహకరిస్తాం.

– కల్వకుంట్ల గోపాల్‌రావు, మోహినికుంట

చర్చించిన తరువాతే ఆమోదిద్దాం



ఎజెండా అంశాలను చదువుతూ చప్పట్లు కొట్టడం సరికాదు. అంశంపై చర్చ జరిగిన తరువాత సభ ఆమోదం తెలిపేలా చప్పట్లు కొడదాము. ముందే చప్పట్లు కొడితే అంశాన్ని చర్చించకుండానే ఆమోదించినట్లు అవుతుంది. మిడిల్‌పోల్స్ సమస్య తీవ్రంగా ఉంది. లూజు వైర్లను సరిచేసి, ప్రమాదాలు జరగకుండా చూడాలి.

– సత్తార్, సిరిసిల్ల

స్టోర్స్ దూరంగా ఉంది



'సెస్' సంస్థ స్టోర్స్‌ను బైపాస్‌రోడ్డులో అపెరల్ పార్క్ అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. సొంత స్థలాన్ని రక్షించుకోవాలి. లేదా కొత్త స్థలాన్ని ప్రభుత్వం నుంచి సాధించి మరోచోట శాశ్వతంగా ఏర్పాటు చేయాలి. సంస్థలో పాతుకుపోయిన సిబ్బందిని బదిలీ చేయాలి. అర్హులైన సిబ్బందికి ప్రమోషన్లు అందించాలి.

– బొడ్డు నారాయణ, నూకలమర్రి

దీపావళి ప్రమాద బాధ్యులు ఎవరు?



ఏ ప్రభుత్వ ఆఫీస్‌లో లేని విధంగా దీపావళి రోజు 'సెస్'లో టపాసులు కాల్చి అగ్ని ప్రమాదానికి బాధ్యులు ఎవరు? పోలీస్ కేసు ఏమైంది? కారణమైన అధికారిని ఎందుకు సస్పెండ్ చేయలేదు. 'సెస్' స్టోర్స్ స్థలం కోసం రైతులతో అష్టదిగ్బంధం చేద్దాం. మన విలువైన స్టోర్స్ స్థలం మనకే కావాలి. అందరికీ అందుబాటులో ఉంటుంది.

– బొల్లబత్తిని సత్యనారాయణ, తాడూరు

ముందే ఎందుకు ఇవ్వడం లేదు



మహాసభకు ముందే ఎజెండా అంశాలను సభ్యులకు ఎందుకు ఇవ్వడం లేదు. సభకు వచ్చిన తరువాత ఇస్తే ఎలా? సభ్యులను సభకు రమ్మని ఆహ్వానిస్తారా.. నోటీసు ఇస్తారా.. ఇదేం పద్ధతి. గతంలో మిడిల్‌పోల్స్‌లో అక్రమాలు జరిగాయి. బోయినపల్లిలో 'సెస్' ఆఫీస్‌ను ఎప్పుడు ప్రారంభిస్తారు. ఎజెండా అంశాలను చర్చించి చప్పట్లతో ఆమోదించాలి.

– జోగినిపల్లి సంపత్‌రావు, నర్సింగాపూర్

ట్రాన్స్‌ఫార్మర్లను షిఫ్ట్ చేయాలి



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పొలాల మధ్య ఉన్నాయి. అవి కాలిపోయినప్పుడు తీసుకెళ్లడం, మార్చడం ఇబ్బందిగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్లను రోడ్డుకు షిఫ్టింగ్ చేయాలి. ఇప్పుడు వరికోతలు అయ్యాయి. వర్షాలు ప్రారంభమయ్యేలోగా ట్రాన్స్‌ఫార్మర్లను మార్చాలి. లూజ్ వైర్లు ఉన్న చోట మిడిల్‌పోల్స్ వేయాలి.

– కసమేని పద్మారెడ్డి, ఆవునూరు

క్లుప్తంగా

గుర్తింపు లేని పార్టీల వివరాలు అందించాలి

సిరిసిల్ల: గుర్తింపు లేని పార్టీల వివరాలు ఈనెల 28 నాటికి అందించాలని భారత ఎన్నికల కమిషన్ కార్యదర్శి లౌకుష్ యాదవ్ కోరారు. ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ చేసుకుని గుర్తింపు పొందని రాజకీయ పార్టీల వివరాలను జిల్లా ఎన్నికల అధికారులు సేకరించి ఈనెల 28 నాటికి అందించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకుని గుర్తింపు లేని రాజకీయపార్టీల అధ్యక్షులకు సమాచారం అందించి, ఎన్నికల కమిషన్ నిర్ణీత నమూనా ప్రకారం రిపోర్టును సంతకంతో సమర్పించాలని తెలిపారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎన్నికల అధికారులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మల్యాల(చొప్పదండి): మండలంలోని కొండగట్టు ఘాట్ రోడ్డు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం (75) కనిపించినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు గురువారం సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. ముత్యంపేట కారోబార్ రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఆన్‌లైన్ షాపింగ్‌లో మోసం

సిరిసిల్లక్రైం: కుటుంబ అవసరాల కోసం ఆన్‌లైన్ షాపింగ్ చేసేందుకు ప్రయత్నించగా రూ.2లక్షలు మోసపోయారు. ఈ మేరకు సిరిసిల్లటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాలు. జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన పూస శ్రీనివాస్ తన గృహ అవసరాల కోసం ఆన్‌లైన్‌లో కొన్ని వస్తువులు కొనేందుకు క్రెడిట్‌కార్డ్ నంబర్లను ఎంటర్ చేశాడు. సీవీఈవ పిన్ ఎంటర్ చేయగానే కార్డులో ఉన్న డబ్బులు తన ఆధీనంలో లేకుండానే పోవడం గమనించాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలకేంద్రంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన జావిద్(40) అనే వ్యక్తిని ద్విచక్రవాహనం ఢీకొట్టగా తీవ్రంగా గాయపడ్డాడు. హుటాహుటిన ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హమీద్ సోదరుడైన జావిద్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

రెండు బైకులు ఢీకొని ఒకరు మృతి

సారంగాపూర్: మండలంలోని కోనాపూర్ శివారు ఎల్లమ్మ గుడి సమీపంలో గురువారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు అక్కడికక్కడే మృతిచెందాడు. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై దత్తాద్రి, గ్రామస్తుల కథనం ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలం బాలపల్లికి చెందిన బేతి మధు (30) గుల్లపేటలోని ఓ కార్యక్రమంలో పాల్గొన్నాడు. తిరిగి బాలపల్లి బైక్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో గుల్లపేటకు చెందిన జగదీష్, రాజిరెడ్డి పొరండ్ల వెళ్లి బైక్‌పై గుల్లపేటకు వెళ్తున్నారు. ఎల్లమ్మ ఆలయం వద్ద మధు, జగదీశ్ వాహనాలు ఢీకొనడంతో మధు అక్కడికక్కడే మృతిచెందాడు. రాజిరెడ్డి, జగదీశ్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జగదీశ్ పరిస్థితి విషమించడంతో కరీంనగర్ తరలించారు.

ఒకే ఇల్లు.. ఒకే వంట

రెండు దశాబ్దాలుగా..



రాజేశం-జయలక్ష్మి కుటుంబం

రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్ కాలనీ హనుమాన్‌నగర్‌కు చెందిన బైరి రాజేశం-జయలక్ష్మి దంపతులకు ముగ్గురు కుమారులు. అందరికి పెళ్లిళ్లయ్యాయి. కొడుకులు, కోడళ్లు, వారి పిల్లతో కలిసి రెండు దశాబ్దాల నుంచి ఉమ్మడిగానే ఉంటున్నారు. అంతా కలిసి పండుగలను సంతోషంగా జరుపుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పెద్ద కుమారుడు నాగరాజు, ఎమ్మెస్సీ బీఎడ్ చదివి ప్రైవేట్ టీచర్‌గా పని చేశారు. కరోనాతో స్కూల్ మూతపడడంతో ప్రస్తుతం యైటింక్లయిన్‌కాలనీలో నాగరాజు అండ్ బ్రదర్స్ అనే పేరుతో కిరాణం షాపు పెట్టుకుని ముగ్గురన్నదమ్ములు నాగరాజు, ప్రవీణ్‌కుమార్, సుమన్‌కుమార్ చుసుకుంటున్నారు. ఉమ్మడిగా కలిసి ఉంటేనే ఆనందం ఉంటుందని రాజేశం పేర్కొన్నారు.

బలం..బలగం

- ఇంటిపెద్ద మాటకు కట్టుబడి
- బంధాలు, బంధుత్వాలకు విలువనిస్తూ
- ఆదర్శంగా నిలుస్తున్న కుటుంబాలు

ఉమ్మడి కుటుంబమంటే కొండంత బలం. ఏ ఆపదొచ్చినా ఒకరికొకరు సాయం చేసుకుంటూ మేమున్నామనే భరోసా ఉంటుంది.. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో బంధాలు, బంధుత్వాలు భారమవుతున్నాయి. పెళ్లయిన కొన్నాళ్లకే వేరుకుంపటి వ్యవస్థ పెరుగుతోంది. ఎప్పుడో ఓసారి కలిసినప్పుడు నామమాత్రపు పలకరింపులు.. తర్వాత ఎవరిదారి వారిదే.. అయినా కొన్ని కుటుంబాలు ఉమ్మడిగా ఉంటూ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారు. ఇంటి పెద్దల మాటకు కట్టుబడి, విభేదాలు లేకుండా కలిసిమెలిసి ఉంటున్నారు. ఉమ్మడి కుటుంబమే కొండంత అండా అన్నట్టు ఆదర్శంగా నిలుస్తున్నారు.

– కోరుట్ల/సారంగాపూర్/యైటింక్లయిన్‌కాలనీ/వేములవాడ/ముత్తారం/మల్యాల



అర్జున్-భీమక్క మనువలు, మనువరాళ్లు

అత్తాకోడళ్లు కాదు.. తల్లీకూతుళ్లు



చెల్పూరి వారి ఉమ్మడి కుటుంబం

రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన చెల్పూరి రాజమ్మ- రాములుది ఆదర్శ ఉమ్మడి కుటుంబం. నలుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. అన్యోన్యత చాటే తోడికోడళ్లు. అత్త సారథ్యంలో కుటుంబ నిర్వహణ. తల్లీకూతుళ్ల వలె కలిసిమెలిసి ఉంటారు. వైషమ్యాలకు తావులేకుండా పండంటి కా పురాలుగా తీర్చిదిద్దుతున్నారు తోడికోడళ్లు సరిత, అంజలి, గాయత్రి, అంజలి. సరిత భర్త ఓదెలు, అంజలి భ ర్త గట్టయ్య, గాయత్రి భర్త రాజమౌళి, అంజలి భర్త లింగమూర్తి. అన్నదమ్ములందరూ వ్యాపారాలు చేసుకుంటున్నారు. వీరి ఉమ్మడి కుటుంబంలో ఎనిమిది మంది పిల్లలు సాయితేజ, సిందూజ, అమూల్య, అక్షిత, రేవంత్, రుత్విక్, రిషిత, కార్తికేయ. ఇక ఆడబిడ్డలు శంకరమ్మ- శంకరయ్య, లక్ష్మీకాంత- రవి. వారి కుటుంబాలతో కలిసి ఉంటున్నారు. ఆడబిడ్డ కుమారుడైన లవకుమార్‌కు సిందూజతో వివాహం జరిగింది. ఆడబిడ్డలు, కూతురు వస్తే ఆ ఇంట్లో పండుగే. నలుగురు తోడికోడళ్లను చూసి ఆదర్శవంతమైన కుటుంబం అని గ్రామస్తులు కితాబునిస్తారు.

ఇంటిపెద్ద మాటే వేదం



అర్జున్-భీమక్క కొడుకులు, కోడళ్లు

జగిత్యాల పట్టణానికి చెందిన కొండేరి అర్జున్-భీమక్క దంపతులకు ఐదుగురు కుమారులు, కుమార్తె. పెద్ద కొడుకు, కోడలు గంగాధర్-శారద. గంగాధర్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు. రెండో కొడుకు, కోడలు వేణుగోపాల్-అన్నపూర్ణ. వేణుగోపాల్ ప్రైవేటు జాబ్. మూడో కొడుకు, కోడలు రాము-సమత. రాము భవన నిర్మాణ రంగంలో పనిచేస్తుంటాడు. నాల్గో కుమారుడు, కోడలు దేవదాసు-భాగ్యలక్ష్మి. ఇతను తన తండ్రి అర్జున్ ఏర్పాటు చేసిన హోటల్ నిర్వహిస్తున్నాడు. ఐదో కొడుకు, కోడలు రాజేందర్-సంధ్య. ఈయన సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో లెక్చరర్. వీరందరికీ ఒకే ఒక్క ఆడపడుచు నవ్వాతు శోభ, బావ రవి. ఇతను మృతిచెందాడు. కోడళ్లు ఐదుగురు ఇంటి సేవలకే పరిమితమై ఇప్పటికీ అత్తామామల మాట జవదాటరు. వారి ఇంటికి ఆడబిడ్డ వచ్చిందంటే అన్నదమ్ములకు ఎనలేని సంతోషం. ప్రతి ఒక్కరూ తమ వృత్తుల్లో వస్తున్న ఆదాయాన్ని తండ్రికి ఇవ్వడం విశేషం. ఐదుగురు అన్నదమ్ముల మధ్య ఏనాడు బేదాభిప్రాయాలు రాలేదు. అర్జున్-భీమక్కకు మనుమలు, మనుమరాళ్లు మొత్తం 38 మంది. తాము ఇప్పటికీ సంతోషంగా ఉన్నామంటే తమ కొడుకుల మధ్య ఏనాడు చిన్న విభేదాలు పొడసూపలేదని, తాము చెప్పిందే వారికి వేదమన్న విధంగా నడస్తున్నారని పేర్కొన్నారు. అందరూ కష్టపడి పనిచేయడం, క్రమశిక్షణతో ఉండడం మాకు కొండంత బలాన్ని ఇస్తుందని, వారి పిల్లలు కూడా కలిసి ఉంటున్నారని అర్జున్-భీమక్క చెప్పుకొచ్చారు.

ఉప్పల జాయింట్ ఫ్యామిలీ



తల్లి జయలక్ష్మితో కొడుకులు, కోడళ్లు, మనువలు, మనువరాళ్లు

వారిది నిరుపేద వైశ్య కుటుంబం. అయినా బంధాలు, బంధుత్వాలను గౌరవిస్తారు. ముందు నుంచి హోటల్ నడుపుకుంటూ జీవించే వసుదైక కుటుంబం. ప్రస్తుతం టిఫిన్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. పెంకుటింట్లో ఇరుకైన గదుల్లోనే వీరంతా ఉంటూ సంతోషంగా జీవనం సాగిస్తున్నారు. వేములవాడ పట్టణంలోని ముదిరాజ్‌వీధిలో ఉంటున్న ఉప్పుల శ్రీరాములు- జయలక్ష్మి దంపతులకు నలుగురు కొడుకులు, ఏడుగురు కూతుళ్లు. కొడుకులు, కోడళ్ల కలిసే ఉంటున్నారు. ఇందులో శ్రీరాములు ఇటీవలే మరణించారు. వీరితోపాటు ఇద్దరు కూతుళ్ల ఇక్కడే ఉంటున్నారు. మిగతా ఐదుగురు కూతుళ్ల తమ తమ అత్తావారిళ్లలో ఉంటున్నారు. ఈ ఉమ్మడి కుటుంబాన్ని నెట్టుకొస్తూ ఈ ప్రాంతానికే ఆదర్శంగా నిలుస్తున్నారు.

సమష్టి కృషి

నాకు 13 ఏళ్లకే పెళ్లయింది. నలుగురు కొడుకులు, ఏడుగురు కూతుళ్ల. అందరికీ పెళ్లిళ్ల చేశాం. ఇప్పటి వరకు ఉమ్మడిగానే ఉంటున్నాం. కుటుంబ సభ్యులమంతా సమష్టిగా కృషి చేస్తూ కాలం వెల్లదీస్తున్నాం. చిన్నపాటి ఇళ్లయినా అనురాగాలు, ఆప్యాయతల మధ్య సంతోషంగా గడుపుతున్నాం. ఇప్పటికీ నా కొడుకులు, కోడళ్ల మా మాటను జవదాటరు. ఉమ్మడి కుటుంబంతో ఎన్నో లాభాలు ఉంటాయి. కొడుకులు, కోడళ్లు, కూతుళ్లు, అల్లుళ్లు, మనువలు, మనుమరాళ్లు, మునిమనువలు మొత్తం 44 మంది అయ్యాం. కానీ, నేటి తరం పెళ్లి కాగానే తల్లిదండ్రులను పట్టించుకోకుండా వేరు సంసారాలు పెడుతున్నారు. ఇది మన సంప్రదాయం కాదు.

– ఉప్పల జయలక్ష్మి, కుటుంబ పెద్ద

అందరూ ఒకే ఇంట్లో..



అట్ల భూమవ్వ కుటుంబం

మల్యాల మండలం తాటిపల్లి గ్రామంలోని అట్ల భూమవ్వ-అర్జయ్య దంపతులకు ఇద్దరు కుమారులు తిరుపతి రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి. తండ్రి కొద్ది రో జుల క్రితం మృతిచెందాడు. అ న్నదమ్ములు ఎవరి పనులు వారు చే సుకుంటూ ఒకే ఇంట్లో ఉంటారు. తిరుపతిరెడ్డి-గాయత్రి దవంతుల కు ఇద్దరు కుమారులు అభినయ్, కార్తీక్‌రెడ్డి. శ్రీనివాస్‌రెడ్డి- సంధ్యకు ఇద్దరు కుమారులు అక్షిత్, జశ్వంత్. అందరూ కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారు. 15 ఎకరాల వ్యవసాయ భూమిని ఉమ్మడిగానే సాగు చేస్తున్నారు. పిల్లల చదువులుసైతం ఉమ్మడిగానే భరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

రోజూ పండుగే..

నా కొడుకులు ఎవరి పనులకు వారు వెళ్తారు. కోడళ్ల ఇంటి, వ్యవసాయ పనులు చేసుకుంటూ, అందరం కలిసిమెలిసి ఒకే ఇంట్లో ఉంటున్నాం. నాకు చేతనైనంత ఇంటి పనుల్లో సాయం చేస్తుంటా. కొడుకులు, కోడళ్లు, మనుమళ్లతో కలిసి ఉంటే రోజూ పండుగ వాతావరణం ఉంటుంది.

– అట్ల భూమవ్వ, తాటిపల్లి



బూడిద తొలగిస్తున్న కార్మికుల బృందం



పగిలిన పైపుకు పునరుద్ధరణ పనులు చేపడుతున్న కార్మికులు



సీఎస్ఆర్ అధికారులకు మొరపెట్టుకుంటున్న బాధిత కుటుంబాలు

పగిలిన బూడిద పైప్‌లైన్ పరిశీలన

- ఇళ్లలో నిండిన బూడిద తొలగింపు
- అధికార, విపక్ష పార్టీల మధ్య వాగ్వాదం

రామగుండం: పట్టణంలోని అక్బర్‌నగర్ పక్కన పగిలిన బూడిద పైప్‌లైన్‌ను గురువారం ఎన్టీపీసీ సీఎస్ఆర్ హెచ్ఆర్ సిగ్దర్ నేతృత్వంలో అధికారుల బృందం క్షేత్రస్థాయిలో సందర్శించింది. పైపులైన్‌తో పాటు బూడిద నిండిన గృహాలను పరిశీలించారు. బాధిత కుటుంబాలతో మాట్లాడి గృహాలు, రహదారులు, డ్రైనేజీల్లో నిండిన బూడిదను కార్మికులతో తొలగించే పనులు చేపట్టారు. భద్రతా చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలు ఎన్టీపీసీ అధికారుల వైఖరిపై తీవ్రస్థాయిలో దుమ్మెత్తి పోశారు. చేపట్టాల్సిన పనులు, మౌలిక సదుపాయాలపై అధికారులకు లిఖితపూర్వకంగా విన్నవించారు. బూడిదతో నిండిన గృహాలను గుర్తించి వారికి పక్కా గృహాలు నిర్మించాలని, నష్టపోయిన వస్తువులకు నష్టపరిహారం చెల్లించాలని, పైపులైన్ పక్క నుంచి రిటైనింగ్ వాల్ నిర్మించి గృహాలకు రక్షణ కల్పించాలని కోరారు. ఎన్టీపీసీ అధికారుల వెంట అంతర్గాం తహసీల్దార్ రవీందర్‌పటేల్, రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు బోయ వెంకట్, గుండేటి సంధ్యారాణి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అయోధ్యసింగ్‌ఠాకూర్, ఆసిఫ్‌పాషా, సంగణవేణి శేఖర్, ఇష్తాకార్ అహ్మద్, కాంతాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికార, విపక్షాల పోటీ

అక్బర్‌నగర్‌లో పైపులైన్ బాధిత కుటుంబాల పరామర్శలో గురువారం అధికార, విపక్ష పార్టీల మధ్య పోటీ నెలకొంది. ఓ దశలో ఉద్రిక్త వాతావరణ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉండటంతో సీఐ ప్రవీణ్‌కుమార్ ఆదేశాలతో భద్రత బలగాలను రప్పించారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ స్థానికంగా లేకపోవడంతో ఆయన సోదరుడు, కాంగ్రెస్ నాయకుడు అయోధ్యసింగ్, మాజీ కౌన్సిలర్ అంజులు తమ అనుచర వర్గంతో బాధిత కుటుంబాల కాలనీకి చేరుకున్నారు. ఆ తర్వాత బీఆర్ఎస్ కాంట్రాక్టు కార్మిక సంఘం నేత కౌశిక హరి నేరుగా బాధిత కుటుంబాలను కలిసి వారికి భరోసా కల్పిస్తూ ఎన్టీపీసీ సీఎస్ఆర్ అధికారులకు ఫోన్ చేయగా అప్పటికే వారు మార్గమధ్యలో ఉండగా, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, మాజీ డిప్యూటీ మేయర్ అభిషేక్ తన అనుచవర్గంతో అక్కడికి చేరుకున్నారు. సీఆర్ఎస్ అధికారులు నేరుగా అధికార పార్టీ నేతల వద్దనే ఉండటంతో విపక్ష నేతలు క్షేత్రస్థాయి పరిశీలనకు రావాలని కోరగా వారికి ఎలాంటి స్పందన లేదు. దీంతో అధికార, విపక్ష నేతల మధ్య కొంతసేపు వాగ్వాదం జరిగింది. సీఎస్ఆర్ అధికారి పోలీసు బందోబస్తు మధ్య వాహనంలో వెళ్లేందుకు యత్నించగా విపక్ష నేతలు వాహనం వెళ్లకుండా రోడ్డుపై బైఠాయించి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దీంతో ఎట్టకేలకు ఏదో మొక్కుబడిగా గృహాలను పరిశీలించి అధికారి వెనుదిరిగారు.

బాధితులకు తాత్కాలిక జీవన భృతి పరిహారం పంపిణీ

ఎన్టీపీసీ యాష్‌పాండ్ సమీపంలోని బూడిద పైపు పగిలిన ఘటనలో నష్టపోయిన బాధిత కుటుంబాలకు గురువారం సీఎస్ఆర్ అధికారి సిగ్దర్ నేతృత్వంలో వందశాతం నష్టపోయి ఆశ్రయం కోల్పోయిన నాలుగు కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి తాత్కాలిక జీవన భృతి కింద రూ.10వేలు అందజేశారు. జీవన భృతి స్వీకరించిన వారిలో తాజ్ అలీబేగ్, ఖదీరా, ఖలీల్‌పాషా, మహ్మద్ ఖైరున్నీసా తదితరులున్నారు.

అనుమానాస్పద స్థితిలో ఇద్దరి మృతి

- ఒకే ఇంట్లో రెండు మృతదేహాలు
- ఉరేసుకొని యువకుడు..
- అక్కడే పడి ఉన్న మహిళ మృతదేహం
- గజసింగవరంలో ఘటన



రేఖ మృతదేహం



శ్రీకాంత్ మృతదేహం

గంభీరావుపేట(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గజసింగవరంలో గురువారం రాత్రి అనుమానాస్పద స్థితిలో ఇద్దరు మృతి చెందారు. ఒకరు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడగా.. అక్కడే ఓ మహిళ మృతదేహం పడి ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఒకే ఇంట్లో రెండు మృతదేహాలు కనిపించిన సంఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గజసింగవరం గ్రామానికి చెందిన ఉల్లి శ్రీకాంత్(27) తన ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అదే ఇంట్లో చెరుకూరి రేఖ(25) అనే వివాహిత మృతదేహం పడి ఉంది. ఆమె శరీరంపై గాయాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. శ్రీకాంత్‌కు వివాహం కాగా.. భార్య గురువారం పుట్టింటికి వెళ్లింది. రేఖ భర్త గల్ఫ్‌లో ఉంటున్నాడు. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై ప్రేమానంద్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శి కథ సుఖాంతం

- సిరిసిల్లకు చేరిన కార్యదర్శి ప్రియాంక
- పట్టణ పోలీస్ స్టేషన్‌లో హాజరు



సిరిసిల్ల పోలీస్ స్టేషన్ వద్ద మాట్లాడుతున్న ప్రియాంక

సిరిసిల్లక్రైం/తంగళ్లపల్లి(సిరిసిల్ల): కాంగ్రెస్ నాయకుల వేధింపులతో అదృశ్యమైన తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి పంచాయతీ కార్యదర్శి మంత్రి ప్రియాంక కథ సుఖాంతమైంది. మూడు రోజుల క్రితం లేఖరాసి ఇంటి నుంచి వెళ్లిపోయిన ప్రియాంక ఆచూకీ కడప జిల్లాలో లభ్యమవడంతో కుటుంబ సభ్యులు పోలీసుల సాయంతో బుధవారం రాత్రి స్వగ్రామానికి తీసుకొచ్చారు. కాగా గురువారం ఉదయం సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ప్రియాంక తనగోడును పోలీసుల ఎదుట వెల్లబోసుకుంది. ఇప్పటికే సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుకాగా.. దర్యాప్తు జరుగుతోంది. ప్రియాంక మీడియాతో మాట్లాడుతూ గ్రామంలో నలుగురు వ్యక్తులు గుగ్గిళ్ల శ్రీకాంత్, గుగ్గిళ్ల అభి, మల్లేశ్, రాజు వేధింపులతోనే తన ఉద్యోగానికి రాజీనామా పంపి వెళ్లిపోయానని తెలిపారు. చేయని పనులకు ప్రభుత్వ ఖజానా నుంచి బిల్లుల కోసం ఒత్తిడి చేశారని వెల్లడించారు. తనను ఇబ్బందులకు గురిచేస్తున్న తీరును ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా తాత్కాలిక పరిష్కారం మాత్రమే చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో అనర్హుల పేర్లను ప్రకటించాలని ఒత్తిడి చేశారని.. అది కుదరదని చెప్పడంతో అనేక మాటలన్నారని అన్నారు. మహిళ అని కూడా చూడకుండా ఏకవచనంతో దురుసుగా మాట్లాడారని ఆరోపించారు. దీనిపై ఎంపీడీవోకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు కూడా వారికే వత్తాసు పలికడం చిన్న స్థాయి అధికారులమైన తమకు రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. వేధింపులు భరించలేకే రాజీనామా పత్రాన్ని వాట్సాప్ ద్వారా ఉనసతాధికారులకు పంపించినట్లు వివరించారు. కుటుంబ సభ్యులతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటానని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఉద్యోగులతో ఎలా ఉండాలో పార్టీ పెద్దలు కింది స్థాయి నాయకులకు సూచించాలని కోరారు.

ఒకే రోజు ఆరు అగ్నిప్రమాదాలు



శాతవాహనలో ఎగిసిపడుతున్న మంటల్లో ఖాళీపోతున్న చెట్లు



శానిటరీ షాపులో మంటలు ఆర్పుతున్న సిబ్బంది

- శాతవాహనలో పెద్ద ఎత్తున మంటలు
- రాత్రి వరకు సేవలందించిన నాలుగు స్టేషన్‌ల ఫైర్ సిబ్బంది

కరీంనగర్‌క్రైం: జిల్లాలో మొత్తం ఆరు అగ్నిప్రమాదాలు సంభవించాయి. వెంటవెంటనే జరిగిన ఆరు అగ్ని ప్రమాదాలు ఫైర్ అధికారులను ఊపిరిపీల్చుకోనివ్వలేదు. మండుటెండలకు విపరీతమైన వేడితో గుర్తు తెలియని వ్యక్తులు పడేసిన అగ్నితో శాతవాహనలో అగ్నిమంటలు చెలరేగగా వెంటనే అప్రమత్తమైన యూనివర్సిటీ అధికారులే ఫైర్ అధికారులకు ఫోన్ చేశారు. డివిజన్ ఫైర్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో కరీంనగర్ ఫైరింజిన్ శాతవాహన యూనివర్సిటీకి చేరుకొని మంటలను ఆర్పే పనిలో నిమగ్నమవగా గాలికి మంటలు ఎక్కువ అవడంతో మానకొండూర్ నుంచి ఫైరింజిన్‌ను పిలిపించారు. కరీంనగర్, మానకొండూర్ ఫైర్ అధికారులు రాజ్‌కుమార్, భూదయ్యలు సిబ్బందితో కలిసి రాత్రి వరకు శాతవాహనలో పొగలురావడంతో అక్కడే ఫైరింజన్‌ల సహాయంతో సేవలు అందించారు.

● ఇవే మంటలకు చెందిన పొగలు కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ వద్దకు రావడంతో అప్రమత్తమైన ట్రైనీ ఐపీఎస్ వసుంధరాయాదవ్ ఫైర్ అధికారులకు సమాచారం అందించడంతో వెంటనే చేరుకొని అక్కడ విధులు నిర్వహించి మంటలు ఎగిసిపడకుండా చర్యలు చేపట్టారు. ఈప్రమాదంలో శాతవాహనలో వివిధ రకాల చెట్లు కాలిపోయాయి.

● పద్మనగర్‌లోని వ్యవసాయ కేంద్రం వెనుక నుంచి ప్రారంభమైన మంటలు యూనివర్సిటీ వైపు రావడంతో అక్కడి వైపు నుండి కూడా పొగమంటలు పెద్ద ఎత్తున రావడంతో వేములవాడకు చెందిన ఫైర్ ఇంజన్ పిలిపించారు.

● శాతవాహన యూనివర్సిటీ గేటువద్ద ఒక సానిటరీ షాపులో షాట్‌సర్క్యూట్ తో మంటలు చెలరేగాయని వెంటనే యూనివర్సిటీలో సేవలందిస్తున్న మానకొండూర్ ఫైర్ ఇంజన్‌ను పంపించి అక్కడ మంటలను ఆర్పారు.

● కరంనగర్ లోయర్ మానేరు డ్యాం వద్ద గల ఐటీ టవర్ వెనక ప్రాంతంలో మంటలు చెలరేగడంతో స్థానికులు ఫోన్ చేయగా చొప్పదండి ఫైర్ ఇంజన్ తెప్పించి మంటలను ఆర్పారు. ఈ ప్రమాదంలో ఎలాంటి నష్టం జరగలేదు.

● నాగులమల్యాలలోని ఇండ్ల పక్కన గల ఖాళీ ప్రదేశంలో మంటలు చెలరేగడంతో వేములవాడ ఫైర్ ఇంజన్‌తో మంటలు ఆర్పారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలో ఉపాధి కూలీలు, రైతులు వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారిణి సారియా అంజుమ్ అన్నారు. మండలకేంద్రంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు, ఐకేపీ కేంద్రాల వద్ద వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను అందించారు.

కార్యవర్గం ఎన్నిక

ఇల్లంతకుంట(మానకొండూర్): మండల ఎస్‌హెచ్ఆర్‌సీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల ఎస్‌హెచ్ఆర్‌సీ చైర్మన్‌గా కాసుపాక శ్రీనివాస్, గంగం అనిల్ ప్రధాన కార్యదర్శిగా, సహాయ కార్యదర్శులుగా పిసకాసి మనోహర్, సహాయ కార్యదర్శులుగా, కాసుపాక బాబు, నారెడ్డి రాజశేఖర్, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మూగజీవాలకు ఆహారం పంపిణీ



గంభీరావుపేట(సిరిసిల్ల): భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి ఆరాధన దినోత్సవం సందర్భంగా మండలంలోని పెద్దమ్మ అటవీ ప్రాంతంలోని మూగజీవాలకు గొల్లపల్లికి చెందిన సత్యసేవా సమితి సభ్యులు గురువారం పళ్లు, మంచినీరు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ కూర రవి, సభ్యులు కొండ రమేశ్, భిక్షపతి, బాబు, శ్రీనివాస్, దేవేందర్, హర్షవర్ధన్, దేవేంద్ర, స్పందన, విజయ, స్వరూప, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

తలనీలాలకు మళ్లీ టెండర్

- ఆరోసారి హాజరైన ఇద్దరు కాంట్రాక్టర్లు
- రూ.14.01 కోట్లకు బహిరంగ వేలం
- కమిషనర్‌కు నివేదిక
- ఆమోదిస్తే ఓకే.. లేకుంటే మళ్లీ టెండర్

వేములవాడ: రాజన్నకు భక్తులు సమర్పించుకునే తలనీలాలను సేకరించుకునే హక్కు రెండేళ్ల కోసం నిర్వహించిన టెండర్ ఈనెల 11తో ముగిసింది. టెండర్ కాలపరిమితి ముగియకముందే ఆలయ అధికారులు నాలుగు దఫాలుగా టెండర్లకు ఆహ్వానించారు. ఈలోగా టెండర్ పూర్తి కాకపోవడంతో వాయిదా పడుతూ వచ్చింది. టెండర్ తేదీ పూర్తికావడంతో ఈనెల 11న టెండర్ నిర్వహించారు. రూ.13.67కోట్లతో ఆన్‌లైన్ టెండర్‌దారుడు హెచ్చుపాటదారుడిగా ఎంపికయ్యాడు. దీన్ని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఆమోదించకపోవడంతో గురువారం మళ్లీ టెండర్ పిలిచారు. ఈ-ప్రొక్యూర్‌మెంట్, సీల్డ్ టెండర్‌లలో ఎవరూ హాజరుకాలేదు. బహిరంగ వేలంపాటలో ఇద్దరు కాంట్రాక్టర్లు ఎల్లయ్య (కళావతి ఎంటర్‌ప్రైజేస్, సికింద్రాబాద్), భూమేశ్వర్‌రావు(శ్రీవల్లభ ఎంటర్ ప్రైజేస్, సికింద్రాబాద్)లు హాజరయ్యారు. ఇందులో రూ.14,01,30,009 కోట్లకు కళావతి ఎంటర్‌ప్రైజేస్ హెచ్చుపాటదారుడిగా ఎంపికయ్యాడు. గత టెండర్‌తో పోలిస్తే రూ.5కోట్ల మేర తక్కువగా ఉండడంతో ఆమోదం కోసం కమిషనర్‌కు నివేదిక ఇచ్చినట్లు ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా ఈనెల 12 నుంచి ఆలయ అధికారులు అదనపు సిబ్బందిని, అదనపు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి తలనీలాలను సేకరిస్తున్నారు. టెండర్ నిర్వహణ పూర్తయ్యే వరకు ఆలయ అధికారులు ఈ బాధ్యతలు నిర్వహించనున్నారు.